

22న 'పాదగయ'లో.. 7
సామూహిక వరలక్ష్మి వ్రతాలు
» 10వేల చీరలు సమకూరుస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. ఐదు బ్యాచ్‌లుగా నిర్వహణ
» ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్సీ హరిప్రసాద్

రెడ్ అలర్ట్

జిల్లావ్యాప్తంగా భారీవర్షం



తునిలో జోరుగా కురుస్తున్న వర్షం

- ఒకవైపు భారీవర్షాలు.. మరో రెండు, మూడురోజులు ఇదే పరిస్థితి
- అల్పపీడనం ప్రభావంతో ఆదివారం రోజంతా భారీవర్షం
- వాయుగుండంగా మారనున్న అల్పపీడనం
- దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర మధ్య రేపు తీరం దాటే అవకాశం
- ఆ ప్రభావంతో రాష్ట్రంలో కొనసాగనున్న భారీవర్షాలు
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు రెడ్ అలర్ట్
- తూర్పుగోదావరి, అల్లూరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు
- లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచన
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ
- ఇప్పటికే వర్షాలకు మునిగిన పంటలు.. ఆందోళనలో రైతులు

రెడ్ అలర్ట్.. ఒకవైపు వర్షాలు కురుస్తున్నాయి.. మరో రెండు, మూడురోజులపాటు కురవనున్నాయి. దక్షిణ ఒడిశాతోపాటు ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలో కొనసాగుతున్న అల్పపీడనం వాయుగుండంగా మారే ప్రమాదముందని విశాఖ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇది ఈనెల 19 తీరం దాటవచ్చని, ఈ ప్రభావంతో రాష్ట్రంలో భారీవర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు రెడ్ అలర్ట్.. తూర్పుగోదావరి, అల్లూరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. భారీవర్షాలతో రెడ్ అలర్ట్ నేపథ్యంలో సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్‌ను కలెక్టర్ రద్దు చేశారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్టు డీఈవో తెలిపారు. అల్లూరి జిల్లాలో కూడా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఆదివారం భారీవర్షం కురుస్తూనే ఉంది. అల్పపీడన ప్రభావంతో తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా వర్షం జిల్లావాసులను వణికించింది. కొన్నిరోజులుగా వేసవిని తలపించే వాతావరణంతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఆకాశానికి చిల్లుపడిందన్నట్టుగా కుండపోతగా ఆదివారం సాయంత్రం వరకు వాన పడుతూనే ఉండడం విశేషం. ఉదయం నుంచి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. కాకినాడలోని శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. భారీ వర్షంతో కాకినాడ నగరంలో రహదారులన్నీ జలమయమయ్యాయి.

తొండంగిలో అత్యధిక వర్షపాతం

జిల్లాలో ఉదయంనుంచి సాయంత్రం 5గంటల వరకు మొత్తం 521.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.తొండంగిలో అత్యధికంగా 39.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా గండేపల్లిలో 10.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోటనందూరులో 36.8, తునిలో 36.6, పిఠాపురంలో 36.2, ఏలేశ్వరం 26.6, కొత్తపల్లి 26.6, కాకినాడ రూరల్ 26.2, సామర్లకోట 25.4, ప్రత్తిపాడు 24.2, గొల్లప్రోలు 24.2, రౌతులపూడి 24.2, తాళ్లరేవు 23.2, కాకినాడ అర్బన్ 23.2, కాజులూరు 22.8, శంఖవరం 22.0, కిర్లంపూడి 21.4, కరప 21.2, పెద్దాపురం 19.2, పెదపూడి 17.2, జగ్గంపేట 14.2 సెం టీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అల్పపీడన ప్రభావంతో మరో మూడురోజులపాటు వర్షం కురిసే అవకాశం ఉండడంతో కాకినాడ పోర్టులో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. మరికొన్ని రోజులపాటు కొనసాగించనున్నట్టు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని సూచించారు. మరోవైపు ఈ వర్షాలు వ్యవసాయ పనులకు ఉపయోగకరంగా ఉంటాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఒకటి, 23న మరొకటి

దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాబోయే మూడురోజుల్లో కోస్తా జిల్లాలో కొన్ని చోట్ల భారీనుంచి అతిభారీవర్షాలు కురిసే ప్రమాదం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సోమవారం మరో అల్పపీడనం ఏర్పడొచ్చని వాతావరణశాఖ వెల్లడించింది. ఈనెల 23న బంగాళాఖాతంలో ఇంకో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు నెలలో భారీ వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయి.

నేడు పాఠశాలలకు సెలవు

భారీవర్షాల నేపథ్యంలో రెడ్అలర్ట్ ప్రకటించిన కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు స్థానిక సెలవు ప్రకటించడమైనదని డీఈవో రమేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. అన్ని యాజమాన్య పాఠశాలలకు ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు ఈ విషయాన్ని తెలియపరచాలని ఆయన ఆదేశించారు. అల్లూరి జిల్లాలోని పాఠశాలలకు కూడా సెలవు ప్రకటించారు.

కలెక్టరేట్ పీజీఆర్ఎస్ రద్దు

భారీవర్షాల నేపథ్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్లో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)ను రద్దు చేసినట్టు కలెక్టర్ షాన్‌మోహన్ ప్రకటించారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలోనూ పీజీఆర్ఎస్‌ను రద్దు చేశామని కార్పొరేషన్ కమిషనర్ భావన తెలిపారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలోనూ..

జిల్లాలో ఈరెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈనెల 18వతేదీ సోమవారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను రద్దు చేశామని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

అల్పపీడనం వాయువ్య దిశలో వాయుగుండంగా మారే అవకాశం ఉన్నందున వచ్చే 24 గంటల్లో కాకినాడ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరిక జారీ చేశారు. ప్రజలంతా ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోను ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను వాగులు, వంకలు వంటివి దాటే ప్రయత్నం చేయవద్దన్నారు.

కాకినాడ కార్పొరేషన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో రానున్న రెండురోజులుగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం కమిషనర్ భావన రానున్న రెండురోజులపాటు కాకినాడలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చాలాఏళ్ల క్రితం నిర్మించి శిథిలావస్థకు చేరిన భవనాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల దృష్ట్యా కాకినాడ కార్పొరేషన్‌లో 24 గంటలు అందుబాటులో ఉండేలా కంట్రో ల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. వర్షాలవల్ల ఎటువంటి ఇబ్బంది ఏర్పడిన రోడ్లు తెగిన, చెట్లు కూలిన, ట్రాఫిక్ ఇబ్బంది కలిగిన టోల్‌ఫ్రీ నెంబరు 18004255990 కంట్రోల్ రూమ్‌లో ఉన్న సిబ్బందికి ఫోన్ చేసి వెంటనే సమాచారమివ్వాలన్నారు.

స్థిరంగా సుద్దగడ్డ వరద ఉధృతి

గొల్లప్రోలు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సుద్దగడ్డ వరద ఉధృతి స్థిరంగా కొనసాగుతోంది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ పెరుగుతూ వచ్చిన వరద తర్వాత నిలకడగా ఉంది. వరి చేలు మునిగిపోయాయి. కాయగూరల పంటలు సాగు చేసిన పొలాల్లోను వర్షపు నీరు నిలిచిపోయింది. గొల్లప్రోలు శివారు కొత్తకాలనీ వద్దగల బ్రిడ్జి నిర్మాణంలోఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ రహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వరుసగా నాలుగోరోజు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాలనీవాసులు నిచ్చెన సహాయంతో బ్రిడ్జి పైకి ఎక్కి దాటి పట్టణంలోకి రాకపోకలు సాగిస్తున్నారు. పట్టణ శివారులోని సూరంపేటకు వెళ్లే మార్గాల్లో వరద నీరు ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాలతోపాటు స్థానికంగా ఆదివారం రోజంతా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో సుద్దగడ్డ వరద ఉధృతి సోమవారం భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే రహదారులతోపాటు కాలనీలు ముంపునకు గురవుతాయని, గొల్లప్రోలులోని ఎస్సీ కాలనీ, అరుంధతీయపేట, ఈబీసీ కాలనీ, దేవీనగరం, శివాలయమాన్యం, కంకరరేవడ్లు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



పిఠాపురం మండలం జములపల్లిలో వర్షపు నీట మునిగిన వరి పొలాలు

పన్నులేనివి.. 1836

పుర ఆదాయానికి భారీగా తూట్లు



పిఠాపురం వ్యూ

ఏ జిల్లాలో నిర్మాణాలెన్ని

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 1836 భవనాలకు అసలే పన్నులు విధించలేదని గుర్తించారు. అత్యధికంగా కాకినాడలో 365 నిర్మాణాలు ఉండగా రూ.1.33 కోట్లు ఆదాయాన్ని కార్పొరేషన్ కోల్పోతోంది.పిఠాపురంలో 67 నిర్మాణాలకు రూ.3.65 లక్షలు, పెద్దాపురంలో 148కి రూ.6.72 లక్షలు, గొల్లప్రోలులో 24కి రూ.71 వేలు, సామర్లకోటలో 85కి 1.71లక్షలు, తునిలో 33కి రూ.1.59 లక్షలు, ఏలేశ్వరంలో 51 నిర్మాణాలకు పన్నులు వేయకపోవడంతో 1.55 లక్షల ఆదాయానికి గండిపడింది.
- తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో 457 భవనాలు, నిర్మాణాలకు పన్నులు విధించకపోవడంవల్ల 59.49 లక్షలు, కొవ్వూరులో 70కి రూ.1.74 లక్షలు, నిడదవోలులో 213కి రూ.6.42 లక్షలు ఆదాయాన్ని పుర సంస్థలు కోల్పోయాయి.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మునిసిపాలిటీ పరిధిలో 99 ని ర్మాణాలకు పన్నులు వేయకపోవడం వల్ల రూ.6.39 లక్షలు, మండపేటలో 112 నిర్మాణాలకు రూ.6.14 లక్ష లు, రామచంద్రపురంలో 52కి రూ.2.47లక్షలు, ముమ్మిడివరంలో 60 నిర్మాణాలకు పన్నులు వేయకపోవడం వల్ల రూ.1.30 లక్షల ఆదాయానికి గండిపడింది. ఇవి సర్వేలో వెలుగుచూసినవి మాత్రమే. వాస్తవంలో పిఠాపురంలో పన్నులు విధించని నిర్మాణాలు వెయ్యి వరకూ ఉండే అవకాశం ఉంది. కాకినాడ కార్పొరేషన్‌తో పాటు మిగిలిన పట్టణాల్లోనూ అదే పరిస్థితి ఉంది.

పైసలిచ్చుకో.. పనికానిచ్చుకో.. ఇది ఎక్కడైనా పురపాలక సంఘాల సిబ్బంది తీరు.. మాకు పన్ను తగ్గాలండి బాబు అని మునిసిపల్ సిబ్బంది దగ్గరకు వెళితే అదెంత పని అంటారు.. మూమూళ్లు ఇస్తే చేసి పెట్టేస్తారు.. ఇలా పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు, కార్పొరేషన్లల్లో ఆస్తి, కుళాయి పన్నుల విధింపు ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉంది. ఒక నిర్దిష్ట విధానం లేకపోవడం, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఆదాయానికి భారీగా గండి పడుతోంది. పట్టణాలు, నగరాల్లో వార్డు సచివాలయ సిబ్బంది, మునిసిపల్ అధికారులు, సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి జీపీఎస్ ఆధారంగా సర్వే నిర్వహిస్తే మరిన్ని లోపాలు వెలుగుచేసే అవకాశం ఉందని విశ్రాంత మునిసిపల్ అధికారులు చెబుతున్నారు.

- పైసలిచ్చుకో.. పన్ను తగ్గించుకో
- ఇంకనూ మారని పుర సిబ్బంది తీరు
- పన్నులు తగ్గించేసి.. అడ్డగోలుగా వేసేసి
- ఇష్టానుసారంగా భవనాల పన్నులు
- నగరాలు, పట్టణాల సర్వేలో వెల్లడి
- ఇది అధికారికంగా బయటపడిన లెక్క
- వాస్తవంలో 10 రెట్లు ఉండే అవకాశం
- 4,200 భవనాలకు పన్నులు తగ్గింపు
- రూ.6 కోట్లకు పైగా ఆదాయానికి గండి

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

అంతా అడ్డగోలు వ్యవహారమే. నాటి వైసీపీ ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి పుర అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కొత్త నిర్మాణాలకు పన్నులే విధించకపోగా అప్పటి వరకూ ఉన్న ఆస్తిపన్నులను సైతం కేటగిరీలు, భవనాల కొలతలు మార్చివేసి పుర ఆదాయానికి గండికొట్టారు.ప్రస్తుతం ప్రత్యేక బృందాలు చేస్తున్న సర్వేలో అధికారులు చేసిన పలు అడ్డ గోలు వ్యవహారాలు బయటపడుతున్నాయి. పన్నులు విధింపు, తగ్గింపువల్ల ఏడాదికి రూ.6 కోట్లకు పైగా పుర ఆదాయానికి గండిపడినట్టు వెలుగుచూడగా పూర్తిస్థాయిలో సర్వే నిర్వహిస్తే 10 రెట్లు పైగా ఉండే అవకాశం ఉంది. సర్వేలు, థర్డ్ పార్టీ అధికారుల బృం దాలు నిర్వహించిన తనిఖీల్లో వెలుగుచూసిన అంశాల ఆధారంగా అప్పుడు పనిచేసిన బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు మునిసిపల్ ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు.

సిబ్బంది ఇష్టారాజ్యం..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్న పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు, కార్పొరేషన్లలో గృహాలు, భవనాలు, వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం పూర్తి కాగానే వాటిని గుర్తించి రెవెన్యూ విభాగంలోని సిబ్బంది, అధికారులు కొలతలు తీసుకుని పన్నులు విధించాలి. పలు పట్టణాలు, నగరాల్లో ఈ ప్రక్రియ సజావుగా సాగలేదు. చాలా చోట్ల కొత్త నిర్మాణాలను గుర్తించే ప్రక్రియే నిర్వహించలేదు. దీనివల్ల పుర ఆదాయానికి ఏటా భారీగా గండి పడుతోంది.అప్పటికే పన్నులు విధించిన భవనాల కొలతలు తగ్గించి చూపించడం, వాణిజ్య సముదాయాలు, షాపులు ఉన్నా వాటిని నివాసగృహాలుగా చూపించి తక్కువ పన్నులు విధించి చూపారు. ఈ లొసుగులను మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కార్యాలయంలోని టెక్నికల్ టీమ్ గుర్తించింది.వీటన్నింటి వెనుక అప్పటి వైసీపీ నాయకులు,పుర ప్రతినిధులు ఒత్తిళ్లు ఉన్నట్టు సమాచారం.

అడ్డగోలు తగ్గింపులు

వాణిజ్య భవనాలను నివాసగృహాలుగా చూపించడం, కొలతలు తగ్గించడం, భవన పూర్తి విస్తీర్ణాలు పరిగణలోకి తీసుకోకపోవడం వంటి కారణాలతో భవనాలకు పన్నులు తగ్గించి చూపించినట్లు గుర్తించారు. దీనివల్ల 3032 అన్నిరకాల భవనాలకు సంబంధించి రూ.2.25 కోట్లు ఆదాయాన్ని పుర, స్థానిక సంస్థలు కోల్పోయాయి.దీంతో పాటు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కార్యాలయంలోని టెక్నికల్ టీమ్ ఆన్‌లైన్‌లో పన్నుల మదింపును పరిశీలించగా 1195 నిర్మాణాలకు విస్తీర్ణం మార్పు లేకుండానే పన్నుల తగ్గించినట్టు గుర్తించారు. దీంతో వీటిపై మునిసిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు, సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి జంబ్లింగ్ పద్ధతిలో తనిఖీలు చేశారు. ఇక్కడ మరో రూ.1.50 కోట్ల వరకూ తేడాలు గుర్తించినట్టు సమాచారం.





ఆశ తీరింది!

- గరిష్ఠ వయోపరిమితి 62 ఏళ్లకు పెంపు
- తొలి రెండు ప్రసవాలకు 180 రోజుల సెలవులు
- కూటమి సర్కారు నిర్ణయంతో సర్వత్రా హర్షం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నిరాశ మధ్య కొట్టుమిట్టాడే ఆశా వర్కర్లకు కూటమి సర్కారు చల్లటి కబురు చెప్పింది. వరాల జల్లు కురిపించింది. గరిష్ఠ వయోపరిమితిని 60 నుంచి 62 ఏళ్లకు పెంచింది. తొలి రెండు ప్రసవాలకు 180 రోజుల వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయనుంది. ఆశా కార్యకర్తలందరికీ ప్రయోజనం చేకూర్చేలా గ్రాట్యుటీ చెల్లించాలని సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు.ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4,535 మంది ఆశాకార్యకర్తలు ఉన్నారు. కాకినాడ జిల్లాలో 1442 మంది పనిచేస్తున్నారు. వీరికి ప్రభుత్వం రూ.10 వేల వేతనం అందిస్తోంది. వీరు నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో వెయ్యి మంది జనాభాకు ఒక్కరు చొప్పున ఉంటారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్య స్థితిగతుల గురించి తెలుసుకుంటారు.ప్రజలు ఎవరికైనా వైద్యసాయం అందాలంటే వీరినే తొలుత సంప్రదించాలి. వీరు పేర్లు నమోదు చేసుకుని వైద్యం కోసం పీహెచ్‌సీ, సీహెచ్‌సీల డాక్టర్లకు సిఫారసు చేస్తారు. ఎన్‌సీడీ సర్వేలను చేపడతారు. అన్ని జాతీయ హెల్త్ స్కీమ్‌లకు సం బంధించిన వైద్య సేవల్లో పాల్గొంటారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రజలకు, వైద్యులకు మధ్య వారధిలా కీలకమైన విధు లు నిర్వర్తిస్తారు.

ఫలించిన పోరాటం

కొన్నేళ్లుగా ఆశాకార్యకర్తలను పలు డిమాండ్లపై పోరాడుతున్నారు. వాటి పరిష్కారానికి చొరవచూపాలంటూ ఆందోళనలు చేస్తున్నారు. కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న వారి ప్రధాన డిమాండ్లు పరిష్కారమయ్యాయి. ముఖ్యంగా గ్రాట్యుటీ, ప్రసూతి సెలవులు లేకుండా చాలా ఇబ్బందులు పడే ఆశాలకు కూటమి ప్రభుత్వం పనిచేసే కాలానికి సంవత్సరానికి గరిష్ఠంగా రూ.5 వేల చొప్పున ప్రతి ఆశాకి రూ.1.50 లక్షలు గ్రాట్యుటీ ఇచ్చేందుకు అంగీకరించింది. ప్రసూతి సెలవుల్లేక అవస్థలు పడే ఆశాలకు ఒక్కో ప్రసవానికి ఆరు నెలల చొప్పున మొదటి రెండు ప్రసవాలకు వేతనాలతో కూడిన సెలవు మంజూరు చేయాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం ఆశాల వేతనాన్ని మాత్రమే పెంచింది.ఈ నిర్ణయాలు ఆశా వర్కర్ల ఉద్యోగ భద్రతను పెంచడమే కాకుండా, వారి సేవలకు గౌరవాన్ని కలిగించేలా ఉంటాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరో వైపు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ఆశాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కర్రపెండలానికి కలిసొచ్చింది!

- అనుకూలంగా వాతావరణం
- జిల్లాలో 7వేల ఎకరాల్లో సాగు
- ఇప్పటికే ప్రారంభం
- చిగురించిన రైతు ఆశలు

సామర్లకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా మెట్టప్రాంతాల్లోనే వర్షాధార పంటగా కర్రపెండలం దుంప సాగు చేస్తున్నారు. ఎంత ఎక్కువ తడి ఉంటే అంతగా దుంపలు ఊరతాయి. వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలు మొక్కల ఎదుగుదలకు ఎంత గానో దోహదపడతాయని రైతులు ఆనందపడుతున్నారు. ఇటీవల కాలంలో వరుసగా కురుస్తున్న వర్షాలకు కర పెండలం మొలకలు చిగురించి మొలకలు తొడగడంతో పంటకు జీవకళవచ్చిందని మెట్ట రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.జిల్లావ్యాప్తంగా 7 వేల ఎకరాల్లో జూన్ మొదటి వారంలో కర్రపెండలం దుంప సాగు చేసినట్టు సమాచారం. సాగులో భాగంగా నాట్లు వేసిన అనంతరం ఎండల తీవ్రత కారణంగా నీటి తడులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నీటి తడులు అందక ఎండిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ మొక్కలు వేసు కుంటూ అడపాదడపా కొద్దిపాటి నీటితడులు అందిస్తూ మొక్కలను బతికించుకున్నారు. ఇదిలా ఉండగా వాతా వరణంలో మార్పులు సంభవించి వరుసగా వర్షాలు కుర వడంతో నేలలో పదును చేరి కర్రపెండలం మొక్కలు చిగురించడం మొదలెట్టాయి. దీంతో రైతులు సాగులో భాగంగా ఎరువులు వినియోగం, గొర్రుతోలడం, కలుపు తీత వంటి పనులు ముమ్మరం చేశారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో మొదటి విడత ఎరువులు చల్లే ప్రక్రియ పూర్తిచేశారు.ఈ దశలోనే సాగుపై చీడపీడలను నివారిం చేందుకు సమగ్ర వ్యవసాయ యాజమాన్య పద్ధతులను వినియోగించాలని ఉద్యానవనశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.



గోదావరి ఉధృతం

ధవళేశ్వరం వద్ద పెరుగుతున్న నీటి మట్టం

4,84,214 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల


రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్ వద్ద గోదావరి ప్రవాహం

ధవళేశ్వరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. తెలంగాణ పరివాహకంలోని కడెం, శ్రీపాదయల్లెంపల్లి ప్రాజెక్టుల నుంచి విడుదల చేసిన వరద నీటితో కాళేశ్వరం, పేరూరు వద్ద నీటి మట్టం పెరుగుతూ గోదావరికి చేరుతుంది. దీంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని అంచనా వేస్తూ ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ గేట్లను మరింత పైకి ఎత్తి వరద ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తూ గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి బ్యారేజ్ 175 గేట్లను 1.5మీటర్ల మేర పైకి ఎత్తి 4,84,214 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలివేస్తున్నారు. దీంతో గోదావరి నీటి మట్టం 9.80 అడుగులుగా నమోదైంది. డెల్టా పరిధిలో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల వ్యవసాయ అవసరాలకు నీటి విడుదలను మరింత తగ్గించారు. తూర్పుడెల్టా కాలువకు 1500 క్యూసెక్కులు, మధ్యడెల్టా కాలువకు 200 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 500క్యూసెక్కులు చొప్పున 2200క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 33.70 అడుగులకు చేరుకుంది. నీటి మట్టం మరో 5 అడుగులకు పెరగవచ్చని అధికారుల అంచనా.

తీరం కల్లోలం

కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో లంగర్‌పై బోట్లు


ఉప్పాడ తీరంలో కెరటాలతో కల్లోలంగా ఉన్న సముద్రం

కొత్తపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరం కల్లోలంగా మారింది. ఉప్పా డ, అమీనబాద్, మాయాపట్నం, సూరాడ పేట, కొత్తపట్నం తదితర తీరప్రాంత గ్రామాల నుంచి వేటకు వెళ్లిన మత్స్యకారులు బోట్లకు సముద్రంలో లంగర్లు వేసి ఒడ్డుకు చేరుకున్నారు. రాత్రికి లేదా సోమ వారం ఉదయానికి తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని మత్స్యకారులు చెప్తున్నారు. ఈసారి సముద్రం ఉగ్ర రూపం దాలిస్తే మాయాపట్నం నుంచి కొత్తపట్నం తీరం వరకు కెరటాలు రోడ్డుపైకి దూసుకొచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అతి వేగం.. తీసింది ఇద్దరి ప్రాణం!

- ఆటోను ఢీకొన్న కారు
- అక్కడికక్కడే ఒకరు.. చికిత్స పొందుతూ మరొకరు మృతి
- కోరింగలో ఘటన


మృతిచెందిన యేసు, లక్ష్మి ఫైల్‌ఫొటోలు


కోరింగలో రోడ్డు ప్రమాద దృశ్యం

తాళ్లరేవు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోరింగ 216 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్టు కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కొత్త కోరింగ గ్రామానికి చెందిన నిమ్మితి యేసు(50) రోడ్డు పక్కన నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. పాతకోరింగ గ్రామానికి చెందిన అబరుకుల లక్ష్మి(55), దడాల లక్ష్మి ఆటోలో కొత్త కోరింగలో ఓ చర్చికి వచ్చి తిరిగి వెళ్లేందుకు రోడ్డుపక్కన పార్కింగ్ చేసిన ఆటోలో కూర్చుని డ్రైవర్ కోసం వేచి చూస్తున్నారు. ఇంతలో యానాం నుంచి అతి వేగంగా వచ్చిన కారు వెనుకనుంచి నిమ్మితి యేసును ఢీకొని ఆ ముందు రోడ్డుపక్కన ఆగిఉన్న ఆటోను ఢీకొనడంతో ఆటో పల్టీ కొట్టింది. కారు పక్కకు దూసుకుపోయింది. దీంతో నిమ్మితి యేసు అక్కడిక్కడే మృతిచెందాడు. అబరుకుల లక్ష్మి, దడాల లక్ష్మికి తీవ్రగాయాలు కాగా అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించగా అబరుకుల లక్ష్మి చికిత్స పొందుతూ మరణించింది. దడాల లక్ష్మి చికిత్స పొందుతుంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమదానికి గల కారణమైన కారును పోలీసులు కోరింగస్టేషన్‌కు తరలించారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్

3 కిలోల సీజ్

రాజోలు సీఐ నరేష్‌కుమార్


రాజోలులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్‌కుమార్

రాజోలు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయిని విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ.12వేలు విలువ చేసే 3 కిలోల గంజాయిని సీజ్ చేశామని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. రాజోలు సర్కిల్ పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గంజాయి రవాణా అరికట్టడానికి జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఉత్తర్వుల ప్రకారం కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ పర్యవేక్షణలో రాజోలు సీఐ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో పాత గంజాయి నేరస్తులపై నిఘా పెట్టడంతో రీవిజన్ ప్రోగ్రాంలో భాగంగా పాత నిందితులను పోలీసు స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ చేసిన తరుణంలో ఈ నెల 16న గంజాయి రవాణాపై మలికిపురం ఎస్‌ఐ పి.సురేష్‌కి సమాచారం అందింది. మలికిపురం మండలం శంకరగుప్తంలో చవ్వాకుల నితీష్ స్వగృహంలో గంజాయిని కలిగి ఉండి వ్యాపారం చేస్తున్న వారి నుంచి మలికిపురం మండలం డిప్యూటీ తహశీల్దార్, వీఆర్వోల సమక్షంలో ఎస్‌ఐ సురేష్ 3కిలోల గంజాయిని సీజ్ చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం అర్బన్‌కు చెందిన ఎ.ప్రశాంత్‌కుమార్, మలికిపురం మండలం శంకరగుప్తానికి చెందిన చవ్వాకుల నితీష్, పడమటిపాలెంకు చెందిన తాడి హరీష్‌బాబు, బట్టేలంకకు చెందిన కె.మనోజ్, చింతలమోరికి చెందిన బి.దిశాన్‌కుమార్, కేశనపల్లికి చెందిన జి.శ్యామ్సన్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల తల్లిదండ్రులు కుటుంబపోషణ నిమిత్తం గల్ఫ్ దేశాల్లో ఉండడం వల్ల వారి పర్యవేక్షణ లేకపోవడం వల్ల గంజాయి వంటి చెడు వ్యసనాలకు బానిసలయ్యారని తెలిపారు. గంజాయి రవాణాపై సమాచారం ఉన్న పోలీసులకు లీగల్ టోల్‌ఫ్రీ 1972లో సమాచారం అందజేయాలని సీఐ కోరారు.

కుమారుడి కోసం వెళ్తూ కన్నుమూత

బస్సు ఢీకొని వ్యక్తి మృతి


రమేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సునీత

కరప, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వలసపాకల గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ తోట సునీత తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పూజారిపాలెం గ్రామానికి చెందిన పొనుగుపాటి రమేష్(31) రావులపాలెంలోని ఒక మిఠాయిషాపులో పనిచేస్తున్నాడు. అతడికి వివాహమై ఇద్దరు కుమారులున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్న కుమారుడు వివేక్ వర్ధన్‌ను ఇటీవల కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కుమారుడికి అవసరమైన దుస్తులు తీసుకురావడానికి రమేష్ ఆదివారం ఉదయం బైక్‌పై కాకినాడ నుంచి పూజారిపాలెం బయలుదేరాడు. వలసపాకల గ్రామ శివారుకు వెళ్లేసరికి రామచంద్రపురం నుంచి కాకినాడ వైపు వస్తున్న కావేరి బస్సు అతివేగంగా అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో కుడి భుజానికి బలమైన రక్తపు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సునీత ఘటనా స్థలికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు నటరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వివరించారు.

దొరికిన అడవి పంది

నలుగురిని గాయపరచడంతో పట్టుకున్న స్థానికులు



ఐ.పోలవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం ఐ.పోలవరం, కేశనకుర్రుల్లో నలుగురిని గాయపరిచిన అడవి పందిని స్థానికులు బంధించారు. తీవ్రంగా గాయపడిన ఐ.పోలవరానికి చెందిన దంగుడుబియ్యం వెంకటరాజారావు కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. మరో ముగ్గురు టి.కొత్తపల్లి ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. ఐ.పోలవరం నుంచి కేశనకుర్రులోకి ప్రవేశించిన అడవిపంది అక్కడి జనాలపై దాడికి పాల్పడింది. దీనితో స్థానికులు అడవిపందిని బంధించారు. అటవీ శాఖాధికారులకు అందజేశామని తెలిపారు.

చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్ట్

రూ.9.80 లక్షల విలువైన సొత్తు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ


పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

అన్నవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం పరిసర పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల జరుగుతున్న వరుస చోరీలపై జిల్లా ఎస్పీ ఆదేశాలతో పెద్దాపురం డీఎస్పీ, ప్రత్తిపాడు సీఐ పర్యవేక్షణలో భాగంగా ఆదివారం అన్నవరం జాతీయ రహదారిపై ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.9.80 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ శ్రీ హరిరాజు తెలిపారు. రంపచోడవరానికి చెందిన అడపా సూర్యచంద్ర, కిర్లంపూడికి చెందిన అడపా జోగా అమర్‌గంగాధర్ హైదరాబాద్, వైజాగ్, తుని, ప్రత్తిపాడు, అన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడేవారని పేర్కొన్నారు. 16 కేసుల్లో నిందితుల నుంచి 13 మోటార్‌బైక్‌లు, అర కిలో వెండి వస్తువులు, టీవి, అమ్మవారికి ధరించే రోల్డ్‌గోల్డ్ హారం స్వాధీనం చేసుకోగా ఈ సొత్తు విలువ రూ.9.80 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి ప్రత్తిపాడు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామన్నారు. సమావేశంలో ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు, అన్నవరం ఎస్‌ఐ హరిబాబు తదితరులు ఉన్నారు.

ఆర్చరీ పోటీల్లో పిఠాపురం ఫస్ట్


పోటీల్లో విజేతలకు మెడల్స్ ప్రదానం

పిఠాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ బాలబాలికల పోటీలు ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగాయి.ఒక పక్కన వర్షం పడుతున్నా క్రీడాకారులు తమ లక్ష్యం వైపు గురిచూసి విజేతలుగా నిలిచారు. రాజమహేంద్రవరం, అమలాపురం, రాజోలు, కాకినాడ, పిఠాపురం, తుని తదితర ప్రాంతాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొని ఇండియన్ రౌండ్ కేటగిరీలో పోటీపడ్డారు.ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో పిఠాపురం క్రీడాకారులు మొదటి స్థానంలో నిలవగా, కాకినాడ రెండు, అమలాపురం మూడో స్థానంలో నిలిచారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ ప్రారంభించారు. పోటీలను వీక్షించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం కన్వీనర్ బోడ సతీష్, నాయకుడు అల్లవరపు నగేష్, జనసేన నాయకుడు మార్నీడి రంగబాబు, కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్ పాల్గొనగా,ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు పోటీలను పర్యవేక్షించారు.న్యాయ నిర్ణేతలుగా పి.కృష్ణ, కె.చిన్నబ్బాయి, ఎం.గణేష్, జె.ప్రసాదరావు వ్యవహరించారు.విజేతలను కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్,ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం అభినందించారు.

నేడు వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18న కాకినాడ వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేళాలో వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.ఈ ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్, బీటీపీ, ఎంబీఏ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 77993 76222లో సంప్రదించాలన్నారు.

రేపు సామర్లకోటలో వేదశాస్త్ర పండిత సన్మాన సభ

సామర్లకోట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఈ నెల 19న సామర్లకోట బాలాత్రిపుర సుందరి వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో 27వ వేద శాస్త్ర పండిత సన్మానసభ జరుగనున్నట్టు నిర్వాహక కమిటీ కన్వీనర్ గ్రంధి రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి పలువురు వేదపండితులు ఈ సభకు హాజరై చతుర్వేద పారాయణం చేస్తారన్నారు. అనంతరం పండితులకు సత్కారం నిర్వహించనున్నట్టు తెలిపారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమలకంటి శ్రీనివాసరావును సన్మానిస్తామని రామకృష్ణ తెలిపారు.

నిర్వాసితులపై నిర్లక్ష్య ధోరణి


- సీపీఎం ఆలిండియా సెక్రటరీ బేబి
- పోలవరం నిర్వాసిత ముంపు మండలాల్లో పర్యటన


ఆదివాసీ సంప్రదాయ నృత్యం చేస్తున్న బేబీ

చింతూరు/వీఆర్ పురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి కారణంగా పోలవరం నిర్వాసితులకు అన్యాయం జరిగిందని సీపీఎం పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ అన్నారు. పోలవరం నిర్వాసిత ముం పు మండలాల పర్యటనలో భాగంగా సీపీఎం కేంద్ర కమిటీ ఆదివారం చింతూరు, వీఆర్ పురం మండలం రామవరం, ఎటపాక మండలం రామ్‌గోపాలపురంలో పర్యటించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో బేబీ మాట్లాడుతూ నిర్వాసితులకు జరిగిన అన్యాయంపై రాజ్యసభ, లోక్‌సభల్లో నిలదీస్తామన్నారు. పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పన జరగలేదని, కాలనీలు కూడా నాసిరకంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ మేరకు నిర్వాసితులను ఏకం చేసి న్యాయమైన పునరావాసం, పరిహారం అందే వరకు పోరాటం చేస్తామన్నారు.వైసీపీ హయాంలో సహా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు అన్ని మౌలిక వసతులతో కూడిన కాలనీలు నిర్మించాలన్నారు. భూములు త్యాగం చేసిన వారికి ఎకరాకు రూ.20 లక్షలు ఇవ్వాలని, ఇంటికో ఉద్యోగం కల్పించాలన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు, సీపీఎం పార్టీ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం మాట్లాడుతూ రామవరం గ్రామంలో మొత్తం 279 ఇళ్లు ఉండగా రోడ్డుకు ఒకవైపు ఉన్న 166 ఇళ్లకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని, రోడ్డుకు మరో వైపు ఉన్న ఇళ్లు ముంపు జాబితాలోకి రావా అని ప్రశ్నించారు. తొలుత సీపీఎం బృందానికి చింతూరులో పార్టీ శ్రేణులు, ఆదివాసీలు సంయుక్తంగా కొమ్ము నృత్యాలతో స్వాగతం పలికాయి. గ్రామ సెంటర్‌లో ఉన్న అమరవీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, కార్యవర్గ సభ్యులు వాణిశ్రీ, తులసీదాస్, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏడిదలో పార్కు ప్రారంభం

స్వీయ నిధులు రూ.5 కోట్లతో ఆధునీకరించిన దాత నామాల


ఆధునీకరించిన పార్క్‌లో ఏర్పాటు చేసిన లాన్

మండపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తం జన్మభూమి రుణం తీర్చుకుంటున్నారు. స్వగ్రామం ఏడిదలో పంచాయతీకి చెందిన పెద్ద చెరువు 6.14 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఆ చెరువును పురుషోత్తం దత్తత తీసుకుని సొంత నిధులు రూ.5 కోట్ల వ్యయంతో ఆధునికరించారు. వాకింగ్ ట్రాక్, లాన్, సోలార్ సిస్టం లైటింగ్, ప్రహరీ, చెరువు మధ్యలో 22 అడుగుల స్వామి వివేకానంద విగ్రహం, చిన్నపిల్లల ఆడుకునేందుకు ఉయ్యాలలు, పెద్దలకు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ పార్కును ఈ నెల 18న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించనున్నారు. నామాల పురుషోత్తం, అనంతలక్ష్మి దంపతులు పేరిట నిర్మించిన పార్కు ఏడిద వాసులకు ఆహ్లాదం అందించనుంది. ఇదిలా ఉండగా స్థానిక జడ్పీ హైస్కూల్లో ప్లస్‌టు బాలికల జూనియర్ కళాశాలకు అవసరమైన భవనాలను రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఈ పాఠశాలలో టెన్త్, ఇంటర్‌లో ప్రథమస్థానంలో నిలిచిన వారికి రూ.2 లక్షలు, రూ.5 లక్షలు ఏటా అందిస్తున్నారు. అలాగే పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఫర్నీచర్ సమకూర్చారు.ఆడిటోరియం నిర్మించారు. మూడంతస్తుల భవనం నిర్మించి అందులో కంటి ఆసుపత్రి, లైబ్రరి, వీఆర్వో కార్యాలయం ఏర్పాటు చేశారు. గ్రామానికి చేస్తున్న సేవలను వెలకట్టలేమని సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం కొనియాడారు.


పాదగయలో 22న సామూహిక వరలక్ష్మి వ్రతాలు

10వేల చీరలు సమకూరుస్తున్న పవన్‌కల్యాణ్.. ఐదు బ్యాచ్‌లుగా నిర్వహణ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న హరిప్రసాద్, కేకే తదితరులు

పిఠాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్ల సన్నిధిలో ఈనెల 22న సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నారు. వ్రతాలు ఆచరించే మహిళా భక్తులకు డిప్యూటీ సీఎం, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ 10వేల చీరలు, పసుపు, కుంకుమ సమకూర్చారు. వ్రతాల నిర్వహణ ఏర్పాట్లను ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, జనసేన ప్రోగ్రామ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కల్యాణం శివశ్రీనివాస్, చక్రవర్తి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం హరిప్రసాద్ మాట్లాడుతూ ఐదు బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహిస్తామని, ఈ బ్యాచ్‌లకు అంబిక, భ్రమరాంబ, చాముండి, దుర్గ, ఈశ్వరీలుగా నామకరణం చేశామన్నారు. ఉదయం 5గంటలు నుంచే వ్రతాలు ప్రారంభవుతాయని తెలిపారు.అంతకు ముందు పాదగయలో కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సీఐ జి.శ్రీనివాస్, జనసేన నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

ఏలేరు జలాశయంలో 11.77 టీఎంసీల నీటి నిల్వలు



ఏలేశ్వరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న సహజ ప్రవాహంతో పాటు గోదావరి జలాలు కూడా వచ్చి చేరడంతో ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరుగున్నాయి. ఎగువ నుంచి 1871, పురుషోత్తపట్నం నుంచి 1225 క్యూసెక్కుల చొప్పున నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా ఆదివారం 11.77 టీఎంసీలకు నీటి నిల్వలు చేరాయి. జలాశయం పూర్తిసాయి నీటి మట్టం 86.56 మీటర్లు కాగా ప్రస్తుతం 78.49 మీటర్లకు చేరింది. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నానికి 200 క్యూసెక్కులు, ఏలేశ్వరంలోని తిమ్మరాజు చెరువుకు 400 క్యూసెక్కుల చొప్పున నీరు చేరుతోంది. కాలువలకు సాగు నీరు విడుదలవ్వడంతో రైతులకు పంటలపై భరోసా ఏర్పడింది.

గోపాలపురంలో ఉట్టి వివాదం

ఇరువర్గాల ఘర్షణ.. పోలీస్‌స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదు

గోపాలపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గోపాలపురంలో శనివారం రాత్రి కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. దీనిలో భాగంగా ఉట్టి కొట్టే సమయంలో ఇద్దరి వ్యక్తుల మధ్య ఏర్పడిన భేదాభిప్రాయాలు రెండు వర్గాల మధ్య వివాదానికి దారి తీసింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఉట్టికొట్టిన నేపథ్యంలో ఇద్దరు వ్యక్తుల మధ్య వాట్సాప్ వాయిస్ మెసేజ్‌ల రూపంలో గొడవ ప్రారంభమైంది.దీంతో ఒక యువకుడిపై ఇంకొందరు దాడిచేశారు. తనపై దాడి చేశారంటూ సదరు యువకుడు ఆదివారం తన స్నేహితులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అడిగేందుకు యత్నించగా వారిపై కూడా ఆదివారం రాత్రి దాడిచేశారు. దీంతో మరోసారి వివాదం ఏర్పడింది. దీంతో ఒకరిపైఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. విషయం తెలుసుకుని అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, సీఐ నాయక్‌లకు సమాచారమిచ్చారు. వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడినట్టు సమాచారం.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ విజేత అనంతపురం


అనంతపురం బాలికల జట్టుకు కప్ బహూకరిస్తున్న మర్రెడ్డి శ్రీనివాస్

పిఠాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరుగుతున్న 10వ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్లు విజేతగా నిలిచాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 4రోజుల పాటు జరిగిన ఈ పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి.బాలుర విభాగంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 13 జట్లు, బాలికల విభాగంలో 12 జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో అనంతపురం జట్టు విజేతగా నిలవగా... పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల జట్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలవగా, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల జట్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఆదివారం రాత్రి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పిఠాపురం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొగలి కాశీ విశ్వనాథ్,బొజ్జా మాణిక్యాలరావు, కొత్తెం సుందరకుమార్,రాష్ట్ర, ఉమ్మడి జిల్లాల అసోసియేషన్ల ప్రతినిధులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.



లొల్లాలమ్మకు రూ.9.30 లక్షల విలువైన బంగారు హారం

ఆత్రేయపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామదేవత లొల్లాలమ్మకు మాజీ సర్పంచ్ దివంగత కాయల వెంకట్రావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.9.30 లక్షలు విలువైన బంగారు హారం సమర్పించారు. ఆదివారం కుమారుడు కాయల జగన్నాథం (సర్పంచ్), కాయల నాగేశ్వరరావు, కాయల సత్యనారాయణలు బంగారు హారాన్ని ఊరేగింపుగా తీసుకుని వెళ్లి అమ్మవారికి బహూకరించగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విగ్రహాల ప్రతిష్ఠ

తాళ్లరేవు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జి.వేమవరం రామాలయంవీధి నరసయ్యగారితోటలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో గణపతిస్వామి, అభయాంజనేయ, నాగయంత్రబింబ విగ్రహాలను ఆదివారం ప్రతిష్ఠించారు. అర్చకులు వెలవలపల్లి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భారీ అన్న సంతర్పణ నిర్వహించారు.

రోజంతా వానే...

ఎడతెరిపి లేని వర్షం

రహదారులు జలమయం

ముంపులో వరి పొలాలు



పిఠాపురంలో రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు

పిఠాపురం/గొల్లప్రోలు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లోని రహదారులన్నీ జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ డ్రైన్లు పొంగిపొర్లి రోడ్లపైకి నీరు చేరింది. పిఠాపురంలోని ప్రధాన రహదారులతో వీధులన్నింటిలో వర్షపునీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అంబేడ్కర్ సెంటర్, ఫైర్‌స్టేషన్, ప్రభుత్వాపత్రి, కచేరిసెంటర్, ఉప్పాడ సెంటర్, పాతబస్టాండు, సినిమా సెంటర్, మంగాయమ్మరావుపేట, తారకరామనగర్, చిట్టోడితోట, విద్యుత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. పిఠాపురం బైపాస్‌రోడ్డుతో పాటు కుమారపురం, నరసింగపురం, జములపల్లి, గోకివాడ, రాపర్తి తదితర ప్రాంతాల్లో గొల్లప్రోలు పట్టణం, మండలంలోని గ్రామాల్లో వరి నాట్లు వేసిన, వెదజల్లు పద్ధతిలో వేసిన వరి పొలాలు నీట మునిగాయి. నీరు బయటకు పోయే మార్గాల్లో వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో నీరు బయటకుపంపేందుకు రైతులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కాయగూరల పంటలు సాగు చేసిన పొలాల్లోనూ వర్షపు నీరు నిలిచిపోయింది.



సామర్లకోటలో కురుస్తున్న వర్షం

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీరప్రాంతాల్లో ఆదివారం ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. ఉదయం నుంచి వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. కొత్తపల్లిలో 26.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని మండల సహాయగణాంకులు జి.రామచంద్రమూర్తి చెప్పారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణం, మండలంలోనూ ఆదివారం భారీ వర్షం కురిసింది. పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపైకి డ్రైన్ల నుంచి మురుగు నీరు చేరడంతో చిత్తడి చిత్తడిగా తయారయ్యి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వ్యవసాయ పనుల కు తీవ్ర అంతరాయం నెలకొంది. ఖరీఫ్ వరిసాగులకు రెండో విడత ఎరువులు వేసే ప్రక్రియ నిలిచిపోయినట్టు రైతులు చెప్పారు.



పిఠాపురం మండలం జములపల్లిలో నీట మునిగిన వరి పొలాలు

కొత్తపల్లిలో వికసించిన బ్రహ్మకమలం పుష్పాలు



కొత్తపల్లిలో బ్రహ్మకమలం పుష్పాలు

కొత్తపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి శివారు రవీంద్రపురంలో కాము సోమశేఖ రరావు ఇంటి ఆవరణలో ఆదివారం బ్రహ్మకమలం పుష్పాలు వికసించాయి.

ఎమ్మెల్యే చినరాజప్ప పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని సామర్లకోట విఘ్నేశ్వరా థియేటర్ ఎదురుగా వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రాజప్పను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మార్ల రాంబాబు, నమ్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు శ్రీనివాసు, బొందల రామలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల శ్రమదానం



రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న పోలీసులు

సామర్లకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఫ్లయ్‌ఓవర్ బ్రిడ్జి దిగువ నుంచి కాకినాడ రోడ్డులో అయిదుతూముల వరకూ రోడ్డుకిరువైపులా పెద్దఎత్తున వర్షం నీరు చేరి ఆదివారం వాహనదారులకు ప్రమాదభరితంగా మారడంతో ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు సత్వరం స్పందించారు. సిబ్బందితో కలిసి రోడ్డుకిరువైపులా నీరు నిల్వఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక రంధ్రాలు ఏర్పాటుచేసి నీటి నిల్వలను తొలగించారు. వర్షం కారణంగా ఏర్పడిన గోతులను మట్టి రాళ్లతో పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. తమ ప్రయాణం సులభతరంగా మార్చేందుకు శ్రమదానం చేసిన ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు సిబ్బందికి వాహనదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్మ



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్మ

కాకినాడ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్‌వీఎస్‌కె వర్మ పేర్కొన్నారు. కాకినాడలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘ భవనం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర నూతన పాలకవర్గ సభ్యులను శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ఈనెల 10న గుంటూరులోని ఏపీ ఎన్జీవో భవన్‌లో జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాత అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానం పెట్టి తొలగించి నూతన అధ్యక్ష కార్యదర్శిలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర అధ్యక్ష ఉపాధ్యక్షులుగా పి రమేష్ బాబు, పన్నీర్ సెల్వం, ప్రధాన కార్యదర్శిగా తనను ఎన్నుకున్నారన్నారు. కోనసీమ జిల్లా, రాజమహేంద్రవరం జిల్లాల నుంచి రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుల ఎన్నుకున్నారన్నారు. సంఘాలకు కొత్త కార్యవర్గాలను ఎన్నుకోవడం సాధారణ విషయమని, ఇలాంటి సందర్భాలలో సహకరించాలని తప్ప ఆధిపత్య పోరుకు దిగడం సరికాదన్నారు. పాత పాలకవర్గంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. ఈ భవనంపై రూ.కోటి 40 లక్షల నిధుల దుర్వినియోగం జరిగిందని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, త్వరలోనే విషయం బయటపడుతుందన్నారు. సంఘ భవనం తాళం పాత అధ్యక్షుడి వద్ద ఉంచుకుని తెరవక పోవడం శోచనీయయన్నారు. ఈ విషయంపై నూతన కమిటీలోని నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. త్వరలోనే ఈ భవనంలో సమావేశం ఏర్పాటు చేసుకుంటామని, రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలో కొత్త పాలక కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని వర్మ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం కార్యవర్గ సభ్యులు పి.శ్రీనివాస్, జి రాంబాబు, ఉమ్మడి జిల్లా సంఘం సభ్యులు కె.రవికుమార్, జి.చిన్నారావు, కె.రవి, వి.రాజ్‌కుమార్, ఎండీ.అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

వారాహి అమ్మవారి ఆలయం వద్ద వివాదం

అక్రమంగా ఆలయం స్వాధీనం : నిర్వాహకురాలు ప్రసన్నరాణి ఆరోపణ

కలెక్టర్ ఆదేశాలతో నిబంధనల ప్రకారం స్వాధీనం : ఇన్‌చార్జి ఈవో సౌజన్య



ఆలయ ఇన్‌చార్జి ఈవో సౌజన్యతో మాట్లాడుతున్న ప్రసన్నరాణి

కాకినాడ రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం కొవ్వూరులోని వారాహి అమ్మవారి ఆలయం వద్ద పూర్వపు ఆలయ నిర్వాహకురాలు కాళ్ల ప్రసన్నరాణి పద్మలక్ష్మి, సర్పంచ్ పి.చక్రధర్ ఆధ్వర్యంలో ఆదివారం కొందరు గ్రామస్థులు తమ సొంత స్థలంలో, సొంత డబ్బులతో వారాహి అమ్మవారి ఆలయాన్ని నిర్మించి పూజలు చేస్తున్నామని, ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుందని ఆరోపిస్తూ తిరిగి అప్పగించాలని కోరుతూ నిరసన తెలిపారు. అయితే కలెక్టర్ ఆదేశాలతో నిబంధనల ప్రకారం ఆలయాన్ని దేవదాయ, ధర్మదాయశాఖ శుక్రవారం స్వాధీనం చేసుకుందని ఇన్‌చార్జి ఈవో, సింగిల్ ట్రస్టీ ఆర్.సౌజన్య తెలిపారు. వారాహి అమ్మవారి ఆలయ నిర్వహణపై జిల్లా కలెక్టర్‌కు భక్తుల నుంచి పలు ఫిర్యాదులు చేశారని, వాటిపై విచారణ జరిపితే నిజమని తేలిందని నిర్వాహకురాలుకి నోటీసులు అందించేందుకు ప్రయత్నించగా ఆమె తిరస్కరించారన్నారు. ఈ సందర్భంగా జనసేన కాకినాడ రూరల్ మండలాధ్యక్షుడు కరెడ్ల గోవింద మాట్లాడుతూ ఆలయాన్ని ప్రభుత్వ స్థలంలో కట్టారని, భక్తులు అందించే విరాళాలకు లెక్కలు చెప్పడంలేదని, కుటుంబ సభ్యులు మా త్రమే ఆలయ నిర్వహణ చేస్తున్నారని దేవదాయ శాఖ ఆలయాన్ని స్వాధీనం చేసుకోవడాన్ని సమర్థిస్తున్నట్టు తెలిపారు. వివాదం జరుగుతున్నట్టు ఇంద్రపాలెం పోలీసులకు తెలియడంతో ఎస్ఐ ఎం.వీరబాబు ఆలయం వద్దకు చేరుకుని సమస్యను ఉన్నతాధికారుల వద్ద తేల్చుకోవాలని తెలపడంతో వివాదం సద్దుమణిగింది.

రైతులకు రాయితీలను అందించాలి

ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



లచ్చిపాలెం సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి నాయుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే దాట్ల

తాళ్లరేవు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ఆదివారం లచ్చిపాలెం సొసైటీలో త్రీమెన్‌కమిటీ చైర్మన్ మోపూరి వెంకటరెడ్డినాయుడు, సభ్యులు నీలా లోవరాజు, కోరుకొండ వెంకటరమణలచే సీఈవో భాస్కరరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నుముకని వ్యవసాయరంగానికి ప్రభుత్వం పెద్దపీటం వేస్తుందన్నారు. కార్యక్రమంలో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, డీసీ చైర్మన్ వేగేశ్న భాస్కరరాజు, టీడీపీ నేతలు మందాల గంగసూర్యనారాయణ, మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చెల్లి అశోక్, పొన్నమండ రామలక్ష్మి, వుంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల కారణంగా 'పీజీఆర్ఎస్' రద్దు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే రెండు రోజులు కాకినాడలో భారీ వర్షం కురిచే అవకాశం ఉన్నందున ఈనెల 18వ తేదీ సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను రద్దు చేయడం జరిగిందని కార్పొరేషన్ కమిషనర్ భావన పేర్కొన్నారు.

పాడా కార్యాలయంలో...

పిఠాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాడా కార్యాలయంలో ఈనెల 18న సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి తెలిపారు. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిస్సా తీరంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పీడీ చెప్పారు. అర్జీదారులు విషయాన్ని గమనించాలన్నారు.

కాకినాడలో ఆధునిక క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం

రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

కాకినాడ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నివారణకు కాకినాడలో ఆధునిక క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి రెడ్‌క్రాస్ సొసైటీ ప్రయత్నిస్తోందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వైడి రామారావు పేర్కొన్నారు. స్థానిక సత్కళా వాహిని భవనంలో ఆదివారం జరిగిన ఎన్ఆర్ఐ తల్లిదండ్రుల సంఘం వార్షిక సమావేశంలో వైడీఆర్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ ఆసుపత్రి భవనం నిర్మాణానికి ప్రాథమికంగా రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు దాతలు సుమారు రూ.6 కోట్లు అందించనున్నారన్నారు. దీనిలోని వైద్య పరికరాలను ఓఎన్‌జీసీ సంస్థ పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి సమకూర్చనుందన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘం అధ్యక్షుడు పాలడుగు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలను ఆర్థికంగా అతలాకుతలం చేస్తున్న క్యాన్సర్ నివారణకు కాకినాడలో ఆధునిక ఆసుపత్రి రానుండడం సంతోషకరమన్నారు. సంఘ కార్యదర్శి సీఎస్ఆర్ శర్మ నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయుకే వైస్ చాన్సలర్ సీఎస్ఆర్‌కె ప్రసాద్ కొత్త సభ్యునిగా చేరారు. అనంతరం పలువురు వైద్యులు ఉమాశంకర్, జనార్దన్ ఆరోగ్య సూత్రాలు తెలియజేశారు. సమావేశంలో సంఘ సహాయ కార్యదర్శి నరసింహరావు, కోశాధికారి రామనాథం, సభ్యుడు డాక్టర్ సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు. చివరగా కనకరాజు బాబు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

'నిబంధనల మేరకు ఫీజులు వసూలు చేయాలి'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భూ బదలాయింపు, ప్లాన్ అప్రూవల్స్ లేకుండా అనధికారిక భవనాలు నిర్మించి పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్న నిర్వాహకుల నుంచి నిబంధనల మేరకు ఫీజులు వసూలు చేయాలని తిమ్మాపురం గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం తిమ్మాపురం పంచాయతీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ స్థానికంగా రాజీవ్‌గాంధీ పీజీ కళాశాల జీప్లస్ వన్‌కు అనుమతి పొంది 5 అంతస్తులు నిర్మించి లక్షల్లో పంచాయతీ ఆదాయానికి గండి కొట్టారన్నారు. అలాగే రెండు భవనాలకు అనుమతి తీసుకుని కమర్షియల్ భవన సముదాయంగా అక్షయ కన్వెన్షన్ హాలు నిర్మించి ఆదాయానికి గండి కొట్టారన్నారు. ఇటీవల నిర్వహించిన పంచాయతీ పాలకవర్గ సమావేశంలో ఈ రెండు అంశాలపై అజెండాగా పెట్టి నిబంధనలు పాటించకుండా నిర్మించిన భవనాలకు నిబంధనల మేరకు బెటర్‌మెంట్ ఫీజు కట్టించుకుని, రీ ఎసెస్‌మెంట్ చేసి ఫీజులు రాబట్టాలని పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగిందన్నారు. ఈ మేరకు నోటీసులు జారీ చేసి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించామన్నారు. పంచాయతీ పాలకవర్గం చేసిన తీర్మానాల కాపీలను తదుపరి చర్యల కోసం కౌడా, డీపీవో, ఎస్పీ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు.


30న ఓబీసీ మోర్చా బహిరంగ సభ



కాకినాడలో కరపత్రం ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 30న జరగనున్న ఓబీసీ మోర్చా బహిరంగ సభ విజయవంతం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చ శివప్రసాద్ పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన బీజేపీ కాకినాడ జిల్లా కార్యాలయంలో ఆదివారం సమావేశం జరిగింది. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చ శివప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంచార జాతుల వారు సంస్కృతి వారధులని వారి అభివృద్ధి కోసం పిలుపునిచ్చే భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలన్నారు. అనంతరం విశ్వేశ్వరరావు చేతుల మీదుగా ఓబీసీ మోర్చా నాయకులందరూ కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విశ్వనాథపల్లి శ్రీనివాసరావు, తామరపల్లి దుర్గాప్రసాద్, కుండల సాయి, మేడ విజయలక్ష్మి, దొడ్డి వీరేంద్ర, కొండేటి గంగాధర్, ఘంటసాల గోవిందరాజులు, చోడిశెట్టి రమేష్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు జేఎన్టీయూకే ప్రొఫెసర్ దొరస్వామినాయక్



జేఎన్టీయూకే, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇండోనేషియాలోని యోగ్యాకర్త రాష్ట్రంలో ఈ నెల 20 నుంచి 23 వరకూ జరుగనున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు జేఎన్టీయూకే ప్రొఫెసర్ బీఆర్ దొరస్వామినాయక్‌కు ఆహ్వానం అందింది. అంతర్జాతీయ గ్రంథాలయ, సమాచార శాస్త్ర సంఘం(ఐలీస్) నేతృత్వంలో వర్చువల్ ఆర్బి వ్స్, కల్చరల్ ఐడెం టిటీ ఏ కంపేరిటివ్ స్టడీ ఆఫ్ అర్బన్ రూరల్ డిజిటల్ ఎంగేజ్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై తాను రాసిన పరిశోధనా పత్రంను సదస్సులో సమర్పించనున్నట్టు దొరస్వామినాయక్ తెలిపారు.

'సిఫారసు చేసిన మందులనే వినియోగించాలి'



చేబ్రోలులో మాట్లాడుతున్న సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్త డాక్టర్ భువనేశ్వరి

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టు పరిశ్రమలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిఫారసు చేసిన పురుగుమందులను మాత్రమే వినియోగించాలని సెంట్రల్ సిల్క్‌బోర్డు శాస్త్రవేత్త డాక్టర్ భువనేశ్వరి సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పుప్పాల ఈశ్వరుడు ప్రారంభించిన మల్బరీ, పట్టుపురుగుల మందుల షాపు వద్ద ఆదివారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె రసాయినిక మందుల వినియోగంపై పలు సూచనలు ఇచ్చారు. ఇష్టారాజ్యంగా మందులు వినియోగిస్తే పట్టుపురుగులకు నష్టం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో సెరీకల్చర్ టెక్నికల్ అసిస్టెంట్లు సీహెచ్.దత్తు, చిన్నారి, చినబాబు పాల్గొన్నారు.

'సంప్రదాయబద్ధంగా చవితి ఉత్సవాలు'

పిఠాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయబద్ధంగా వినాయక చవితి వేడుకలను జరుపుకుందామని ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి కాకినాడ జిల్లా ప్రతినిధులు పిలుపునిచ్చారు. పిఠాపురంలోని జైగణేష్ దేవస్థానంలో ఉత్సవసమితి ప్రతినిధులు ఆదివారం సమావేశమయ్యారు. జిల్లా వ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనోత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. సెప్టెంబరు 6న జిల్లా వ్యాప్తంగా వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. 7న చంద్రగ్రహణం ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లో ఆ రోజు మధ్యాహ్నం 12 గంటల తర్వాత విగ్రహాలు ఉండకుండా, నిమజ్జనాలు జరగకుండా చూడాలని సూచించారు. అనంతరం పిఠాపురం నగర గణేష్ ఉత్సవసమితి అధ్యక్షుడిగా బుర్రి మురళీధరరావును నియమిస్తున్నట్లు ప్రకటించారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య, గౌర వాధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు, దువ్వూరి సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు యడ్ల ప్రభాకరరావు, ఏలూరి సూర్యనారాయణ, యాళ్ల కృష్ణారావు తదితరులున్నారు.

ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవం

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ 68వ వ్యవస్థాపక దినోత్సవం కాకినాడలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన కార్యక్రమానికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంజిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వాతిప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సాంబశివరావు, ప్రతినిధులు శివన్నారాయణరెడ్డి, దుర్రాని పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

సామర్లకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు టీచర్ల నియామకంలో భాగంగా డీఎస్సీ ఏర్పాటుచేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చినందుకు కృతజ్ఞతగా సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాలకు చెందిన డీఎస్సీ విజేతలు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యే చినరాజప్పకు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. కౌన్సిలర్లు బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి,అందుగుల జార్జీ చక్రవర్తి పలువురున్నారు.



సంస్కృత ప్రచారసభ నూతన కార్యవర్గం ఎన్నిక

కాకినాడ రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ రామారావుపేటలో 110 ఏళ్ల చరిత్ర గల శ్రీవేణుగోపాల సంస్కృత ప్రచారసభ సర్వసభ్యసమావేశాన్ని ఆదివారం జీవీకృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించారు. సంస్కృత భాషాభివృద్ధికి కృషిచేస్తూ సాహిత్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులు, యువతను చైతన్యవంతం గావించే కార్యక్రమాలు కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్టు సహాయ కార్యదర్శి చింతపల్లి సుబ్బారావు సమావేశంలో నివేదికను సమర్పించారు. సంస్కృత ప్రచారసభ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడిగా కె.సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా కృష్ణంరాజు, అధ్యక్షుడిగా జీవీకే వర్మ, ఉపాధ్యక్షులుగా డీవీకేఆర్, నాగేశ్వరరావు, వెంకటరాజు, ప్రధాన కార్యదర్శిగా పీఎస్ఎస్ కిరణ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారిగా సీహెచ్ సుబ్బారావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులు శ్రీరామమూర్తి, సత్యస్వరూప్,రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

సామర్లకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ బాధ్యతలు

సామర్లకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు ఆదివారం కార్యాలయంలో రిజిస్టర్‌లో సంతకాలు చేసి బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గౌరవ చైర్మన్‌గా ఏర్పాటైన ఈ కమిటీలో చైర్‌పర్సన్‌గా అందుగుల మణికుమారి, సభ్యులుగా సిద్దు వెంకటకృష్ణ భావన్నారాయణ, పోతుల సీతామహాలక్ష్మీ, అడపా భార్గవి చక్ర, తలాటం అత్యుతరామయ్య, బండే అమలావతి, మల్లిపూడి వెంకటగంగాధర్, లింగం ఉషా, దేవిశెట్టి ఏసుబాబు ఉన్నారు. తమ నియామకానికి ఎంతో కృషిచేసిన ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)కు అందుగుల మణికుమారి, మల్లిపూడి వెంకటగంగాధర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డు సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

సర్పవరం జంక్షన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు త్రివిధ దళాల సైనికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ట్రైసర్వీసెస్ వెటరన్ అసోసియేషన్ పనిచేస్తుందని ఆ సంఘం వ్యవస్థాపకుడు, ఉపాధ్యక్షుడు సూర్యదేవర రామారావు తెలిపారు. కాకినాడ ట్రై సర్వీసెస్ వెటరన్స్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవం ఆదివారం కాకినాడ సైనిక సంక్షేమ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రిటైర్డు సైనికులకు ఏ సమస్య వచ్చినా సంఘం దృష్టికి తీసుకువస్తే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించవచ్చన్నారు. అనంతరం 75 ఏళ్లు పూర్తి చేసుకున్న రిటైర్డు సైనికులను సత్కరించి జ్ఞాపిక అందించారు. సంఘం గౌరవ అధ్యక్షులు జీఎస్ఎన్ మూర్తి, కోశాధికారి బి.సుగుణారావు తదితర సభ్యులు పాల్గొన్నారు.



జిల్లాలో పలుచోట్ల ఆదివారం కూడా శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. పిఠాపుంలో కృష్ణుని వేషధారణలో చిన్నారి ఆకట్టుకున్న దృశ్యమిది

పిఠాపురం (ఆంధ్రజ్యోతి)

భారీ వర్షాలతో 'పీజీఆర్‌ఎస్' రద్దు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): వచ్చే రెండు రోజులు కాకినాడలో భారీ వర్షం కురిచే అవకాశం ఉన్నందున ఈనెల 18వ తేదీ సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్)ను రద్దు చేయడం జరిగిందని కార్పొరేషన్ కమిషనర్ భావన పేర్కొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

స్త్రీ శక్తి పథకంతో మన్యం వాసుల్లో ఆనందం

● సీఎం, డిప్యూటీ సీఎం లోకేష్‌కు కృతజ్ఞతలు


మహిళకు జీరో టికెట్ అందిస్తున్న కండక్టర్

మోతుగూడెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం మన్యం మండలాల్లోనూ అమలు కావడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గోకవరం డిపోకు చెందిన పలువురు మహిళలు ఆదివారం ఉదయం మోతుగూడెం, రాజమండ్రి బస్సులో ప్రయాణించగా, వారికి టికెట్ ధర రూ. 190 ఉండగా... జీరో టికెట్ అందించారు. దీంతో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్‌కు మన్యం ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వై.రామవరం: అల్లూరి జిల్లా వై.రామవరం నుంచి కోట మీదుగా రంపచోడవరం వెళ్లే గోకవరం డిపో బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేశారు. తొలుత ఈ రూట్‌లో బస్సుకు స్త్రీశక్తి పథకం లేదంటూ ప్రకటించడంతో గిరిజన మహిళలు తీవ్ర నిరాశకు గురయ్యారు. రోజుకు మూడు సార్లు తిరిగే ఈ బస్సులో జీరో ఫేర్ టిక్కెట్లు కొనసాగించడంతో ఆయా ప్రాంతాల మహిళల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట


జలపాతాల వద్ద పర్యాటకుల సందడి

మోతుగూడెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడుతోంది. వరుస సెలవులు రావడంతో జనమంతా ఏజెన్సీ బాట పట్టారు. శనివారం సాయంత్రం నుంచే వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకి చేరుకున్నారు. దీంతో ఆదివారం మోతుగూడెం పర్యాటక పరిసరాలు జనం రద్దీ నెలకొంది. ప్రస్తుతం అల్పపీడన ప్రభావంతో ఏజెన్సీలోని ప్రకృతి అందాలు మరింత సుందరంగా ఉండడంతో వాటిని తిలకించేందుకు పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. పొల్లూరు సమీపంలో ఉన్న టైగ్రిస్ జలపాతం, ధారాలమ్మ గుడి వద్ద ఉన్న పిక్నిక్ స్పాట్లు సందడిగా కనిపిస్తున్నాయి. పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

దేవీపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు గ్రామ శివారున ఓ వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తన సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. ఇందులో ఒకరి వద్ద నుంచి 10 క్వార్టర్ల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేశారు.

రైతులకు మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపడ్, జెండాకూపి, బచ్చులూరి గ్రామాల రైతులకు ఆదివారం జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఎంపీటీసీ కరకా వెంకటరమణ చేతులమీదుగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వై.రామవరం మండలం అప్పర్ పార్టు ఏపీఎం స్వామి మాట్లాడుతూ రైతులు కోరుకున్న విధంగా వివిధరకాల మొక్కలు ఉపాధి పథకం ద్వారా ఉచితంగా ఇస్తున్నామన్నారు. ఎంపీడీవో బాపన్నదొర ఆదేశాల మేరకు సిద్ధం చేశామ న్నారు. మొదటి విడతగా బొడ్డగండి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎనిమిది గ్రామాలకు చెందిన 56 మంది రైతులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

ఎటపాక, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో ఎటపాక తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ కారం సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్పపీ డన ప్రభావంతో వర్షాలు కురుస్తుండడం, తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కావడంతో వరద పెరిగే సూచనలు ఉన్న నేపథ్యంలో లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గోదావరి వరదల దృష్ట్యా ఎటువంటి సమస్య ఉన్నా 8002085268 ఫోన్ నెంబర్‌ను సంప్రదిం చాలని ఆయన సూచించారు.

జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం


మాట్లాడుతున్న చింతూరు డివిజన్ అధ్యక్షుడు చంద్రశేఖర్

చింతూరు, ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యమని ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ చింతూరు డివిజన్ అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం చింతూరులో సంఘం 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడారు. అంతకుముందు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తదుపరి ర్యాలీగా వెళ్లిన జర్నలిస్టులు ఏరియా ఆసుపత్రిలో వ్యాధిగ్రస్తులకు పండ్లు పంచారు. చివరిగా డివిజను పరిధిలోని సీనియర్ జర్నలిస్టులకు సన్మానం చేసి జ్ఞాపికలను అందించారు. సంఘం నేతలు పీ. వెంకటేశ్వ రరావు, వసంతాల శివకుమార్, రమేష్ విశ్వనాథ్, నాలుగు మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

నిర్వాసితులది జాతీయ సమస్యగా పరిగణించాలి

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం


సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

ఎటపాక, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం జాతీయ ప్రాజెక్టు కాబట్టి... దాని ప్రభావంతో ముం పునకు గురయ్యే నిర్వాసితుల సమస్యను కూడా జాతీయ సమస్యగా పరిగణించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కే. లోకనాథం అన్నారు. ఆదివారం ఆయన నర్సింగ్‌పేటలోని పోలవరం నిర్వాసిత కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాసితులతో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఏపీకి జీవనాడైన పోలవరం ప్రాజెక్టుకు సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. అందుకు నిర్వాసితుల సమస్యను జాతీయస్థాయిలో చర్చకు తీసుకువచ్చేందుకు సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బేబీ, రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిటాస్ రెండురోజులు ముంపు మండలాల్లో పర్య టించారని తెలిపారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేంద్ర, జిల్లా కార్యదర్శి బొప్పా కిరణ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రామారావు, ఐ. వెంకటేశ్వర్లు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ. పద్మ, తదితరులు పాల్గొన్నారు

'పవనగిరి' ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

అడ్డతీగల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగలలో కృష్ణాష్టమి వేడుకలను పవనగిరి స్వామీజీ (తణుకు వెంకటరామయ్య) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద విద్యానికేతన్ ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి 100 విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో హాజరయ్యారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

భారీ వర్షం.. పల్లపు ప్రాంతాలు జలమయం

ప్రత్తిపాడు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు విరామం లేకుండా కుండపోత వర్షం కురిసింది. రోజంతా వర్షం పడటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సుబ్బారెడ్డి సాగర్, చంద్రబాబుసాగర్‌లకు పెద్ద ఎత్తున వరద నీరు చేరుకుంటుంది. మండలంలోని గ్రామాల్లో చెరువులు వర్షం నీటితో నిండుకుండలా కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ వ్యవసాయ సాగుకు భారీ వర్షాలు మేలు చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రత్తిపాడులో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం, ధర్మవరం - పెదశంకర్లపూడి సెంటర్‌లో వర్షం కురుస్తున్న దృశ్యం

సత్యదేవుడి సన్నిధిలో ఎస్పీ పూజలు



అన్నవరం ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడిని ఆదివారం ఎస్పీ బిందుమాధవ్ కుటుంబసభ్యులతో దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



జగ్గంపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు సూచించారు. ఆదివారం జగ్గంపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు, ఘర్షణలో పాల్గొన రాదన్నారు. అసాంఘిక, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా ఉట్టి వేడుకలు



గండేపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టి వేడుకలు నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లంజపల్లి శ్రీనివాస్, ముంగర వెంకటేష్ ఉట్టికొట్టి బహుమతిని సాధించారు. కార్యక్రమంలో లంజపల్లి శ్రీనివాస్(పండు), వీరబాబు, కృష్ణ, ముంగర విష్ణు పాల్గొన్నారు.

నీలాద్రిరావుపేటలో ఉచిత వైద్య శిబిరం


ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గండేపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నీలాద్రిరావుపేట పంచాయతీ వద్ద ఆకాశం మల్టీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. 110మందికి వైద్యసేవలందించి మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్, పెద్దల కోరిక మేరకు వారం రోజులు రక్తపరీక్షలపై 50శాతం రాయితీ ఇస్తామని ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ముల్లంపాక సురేష్ బాబు, ఉపసర్పంచ్ గండికోట శ్రీనివాస్, పాలచర్ల నాగేంద్రచౌదరి, నక్క వెంకటేశ్వర్లు, చిట్యాల బాబ్జి, నారాయణ, చిట్యాల అప్పారావు, అప్పారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడు బాబుకి అభినందనలు


జీను మణిబాబును అభినందిస్తున్న కృష్ణపురం టీడీపీ నాయకులు

జగ్గంపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా జీను మణిబాబును ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఎంపిక చేయడంపై టీడీపీ శ్రేణులు, ఆయన స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కృష్ణాపురం గ్రామం నుంచి సీనియర్ టీడీపీ నాయకులు వెలిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మణిబాబుకి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బాలెం బాబురావు, వేలిశెట్టి బుజ్జి, ముమ్మన నాగేశ్వరరావు, కోన అప్పారావు, కోన ముత్యాలు, కోన లక్ష్మణ్, ఎం ప్రసాద్, పి శ్రీను, అప్పన కాశీ విశ్వనాథం, గవర ఆనందరావు, కోన రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడికి పల్లకీ సేవ



అన్నవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో సత్యదేవుడికి ఆదివారం నిర్వహించాల్సిన రథసేవ స్థానంలో పల్లకీసేవ నిర్వహించారు. 10గంటలకు స్వామి,అమ్మవార్లను పల్లకిలో ఉంచి ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణల నడుమ అనివేటి మండపం చుట్టూ ముమ్మారు ప్రదక్షణ చేశారు.


ఎమ్మెల్యే చినరాజప్ప పూజలు

సామర్లకోట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని సామర్లకోట విఘ్నేశ్వరా థియేటర్ ఎదురుగా వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ ప్రతినిధులు రాజప్పను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మార్ల రాంబాబు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లోవకు పోటెత్తిన భక్తులు


తునిరూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ఆలయ పండితులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కుటుంబ సమేతంగా లోవకు వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదులు, వంట షెడ్లు కింద వంటా-వార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి రూ.4.33 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక వసతులు కల్పించామన్నారు.



జోరువాన..రహదారుల జలమయం

తునిరూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు రోడ్లు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, ఆయా ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. తుని పట్టణంలో సుమారు 20 వార్డుల్లో వర్షపు నీరు డ్రైన్లపై పొంగిపొర్లి చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని ఆయా ప్రాంతాల్లో నారుమడులు నీటమునగ్గా పలుచోట్ల పత్తి పంట ముంపునకు గురైంది. పంటను కాపాడుకునేందుకు అవలంభించాల్సిన విధానాలను రైతులకు ఫోన్‌లో వివరిస్తున్నట్లు ఏవో అశోక్ తెలిపారు.

అంతర్జాతీయ సదస్సుకు జేఎన్టీయూకే ప్రొఫెసర్ దొరస్వామినాయక్



జేఎన్టీయూకే, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇండోనేషియాలోని యోగ్యాకర్త రాష్ట్రంలో ఈ నెల 20 నుంచి 23 వరకూ జరుగనున్న అం తర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు జేఎన్టీయూకే ప్రొఫెసర్ బీఆర్ దొరస్వామినాయక్‌కు ఆహ్వానం అందింది. అంతర్జాతీయ గ్రంథాలయ, సమాచార శాస్త్ర సంఘం(ఐలీస్) నేతృత్వంలో వర్చువల్ ఆర్చి వ్స్ కల్చరల్ ఐడెం టిటీ ఏ కంపేరిటివ్ స్టడీ ఆఫ్ అర్బన్ రూరల్ డిజిటల్ ఎంగేజ్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై తాను రాసిన పరిశోధనా పత్రంను సదస్సులో సమర్పించనున్నట్లు దొరస్వామినాయక్ తెలిపారు.


మత్స్యకారులకు ట్రాన్స్‌పాండర్లు అందిస్తున్న ఎమ్మెల్యే దివ్య

మత్స్యకారుల భద్రతకు అధిక ప్రాధాన్యం

తుని ఎమ్మెల్యే దివ్య

తొండంగి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. ఆదివారం ఆమె దానవాయిపేటలో మత్స్యకారులకు బోట్లలో అమర్చే ట్రాన్స్‌పాండర్లను పంపిణీ చేశారు. వేటకు వెళ్లే సమయంలో అనుకోని ఆపదలు ఎదురైనపుడు ఎస్ఓఎస్ బటన్ నొక్కితే కాకినాడలోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించేందుకు ఈ పరికరాలు ఉపయోగపడతాయన్నారు. దీని ద్వారా సమాచారం అందుకున్న నేవీ, కోస్టుగార్డ్, మత్స్యశాఖ అధికారులు తక్షణం వారికి తగిన సహాయం అందించే అవకాశం ఏర్పడుతుందన్నారు. తుపానుల సమయంలో బోటు ఏ ప్రాంతంలో ఉందో, ఎక్కడ మత్స్య సంపద ఉందో తెలుసుకునేందుకు కూడా ఈ పరికరం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు కోడ వెంకటరమణ, చొక్కా కాశీ, ఎఫ్‌డీఓ ఉమామహేశ్వరరావు స్థానిక మత్స్యకార నేతలు తదితరులు పాల్గొన్నారు.


కత్తిపూడిలో చిట్టిబాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రేణులు

దివంగత చిట్టిబాబు సేవలు చిరస్మరణీయం

శంఖవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దివంగత పర్వత చిట్టిబాబు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన జయంతి సందర్భంగా కత్తిపూడి సీతారామ కళాశాలలో చిట్టిబాబు విగ్రహానికి శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కీర్తి సుభాస్, గాబు కృష్ణ, కొయ్యా రమణ, కేశంగి జనార్దన్, సాదనాల లక్ష్మీబాబు, మండల యువత అధ్యక్షుడు గాబు శివ, దేశలింక వెంకటరమణ, నక్కా శ్రీను, రౌతు శివ, నాయుడు బుజ్జి, దూది సూరిబాబు, బొర్రా వాసు, రౌతు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో మచ్చలేని మనిషి...

రౌతులపూడి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో మచ్చలేని మనిషి దివంగత పర్వత చిట్టిబాబు అని టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, గిరిజన నేత ఈగల సత్తిబాబు అన్నారు. మూలగపూడి, రౌతులపూడి, ఎస్.పైడిపాల గ్రామాలతో పాటు మిగిలిన గ్రామాల్లో టీడీపీ నేతలు చిట్టిబాబు జయంతిని నిర్వహించారు. ఎమ్మెల్యేగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి, టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు.

కొత్తపల్లిలో వికసించిన బ్రహ్మకమలం పుష్పాలు

కొత్తపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి శివారు రవీంద్రపురంలో కాము సోమశేఖ రరావు ఇంటి ఆవరణలో ఆదివారం బ్రహ్మకమలం పుష్పాలు వికసించాయి.



ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ప్రత్తిపాడు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఒమ్మంగిలో వేంచేసి ఉన్న శ్రీఅలిమేలు మంగ పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ద్వితీయ కల్యాణ వార్షిక మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పెళ్లి పీటలపై రామకుర్తి నరేష్, గంగా భవాని దంపతులు కూర్చుని స్వామివారి కల్యాణాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లు ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణ బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులు వేడుకగా నిర్వహించినట్లు శ్రీబాలాజీ ఆలయ నిర్మాణ, శ్రీవారి ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు తెలిపారు.

లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్తిపాడు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ధర్మవరం సీతంపేటలో ఆదివారం లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. లక్ష్మీగణపతి విగ్రహాన్ని స్థానిక ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీకి ఆలయ అభివృద్ధికి రూ.20 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు వైస్ ఛైర్మన్ ముదునూరి సీతారామరాజు, గ్రామసర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, గదుల శివ, బొల్లు నాగేశ్వరరావు, ఉర్లంకుల చంద్రరావు, గింజాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలం


ప్రత్తిపాడులో విరబూసిన బ్రహ్మకమలం

ప్రత్తిపాడు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని సాగునీటి సంఘం ఛైర్మన్ చలంకూరి వెంకటేశ్వరరావు పెరటిలో సోమవారం బ్రహ్మకమలం పూసింది. అలాగే ధర్మవరంలోని గొనగాల గోపాలస్వామి వ్యవసాయ పొలంలో ఉన్న బ్రహ్మజెముడుకు కూడా రెండు పువ్వులు పూశాయి. ఈపువ్వులను పలువురు ఆసక్తిగా తిలకించారు.

తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తొండంగి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని మండలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ కనకారావు తెలిపారు. తీర ప్రాంత గ్రామాల్లో చాటింపు ద్వారా ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. మత్స్యకారులను సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరిక జారీ చేశామన్నారు. రెవెన్యూ అధికారులను స్థానికంగా ఉండి ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.


ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అవార్డు అందుకుంటున్న తాతయ్యనాయుడు

తాతయ్యనాయుడికి అవార్డుపై హర్షం

తునిరూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.తాతయ్యనాయుడు ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డును అందుకున్నారు. ఆయన్ను జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్‌గా నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తాతయ్యనాయుడిని ఆంధ్రా విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఆచార్యులు డి.సింహాచలం, విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వికె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, పలువురు విద్యార్థులు అభినందించారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ వేడుకలు

తునిరూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ వేడుకలను ఆదివారం ది తుని ప్రెస్ క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టులు హాజరై కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పేదలకు పండ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో దేవవరపు కృష్ణార్జునరావు, పసగడుగుల రాంబాబు, అద్దాల నానాజీ, కెళ్ల శివాజీ, పోలమరశెట్టి మధు, డీఎస్ఎస్ ప్రభాకర్, చెక్కిరాల చక్రి, యర్రా వరహాలు బాబు, పప్పు గంగాధర్ తదితరులు ఉన్నారు.